# ఇది ప్రేమే నంటారా?

"రైలు టయిమవుతుంటే ఇంకా వీధి గుమ్మంలో నిలబడి ఏం చేస్తున్నావు? వచ్చి సామాన్లు బయటపెట్టించక!" అంటూ విసుక్కుంటున్న అన్నపూర్ణమ్మని సుమతి చిరాగ్గా చూస్తూ లోపలి కొచ్చి పెట్టెలు బయట పెట్టించసాగింది.

తండ్రి తీసుకొచ్చిన టాక్సీలలో వచ్చిన బంధుమిత్రులతో సహా అంతా ఎక్కి స్టేషన్‌కు బయలుదేరారు.

పెళ్లిళ్ల సీజను కావడంతో రైళ్లన్నీ బాగా రద్దీగా ఉన్నాయి. రాజశేఖరంగారు ముందే ఫస్టు క్లాసు రిజర్వేషను చేయించి ఉంచడం వల్ల ఇబ్బంది లేకుండా బంధుమిత్రులతో పెళ్లివారు విశాలంగా, దర్జాగా కూర్చున్నారు.

ఎదుటి సీట్లో నిలువు బొట్టు, బుగ్గని నల్లచుక్కతో పెళ్లి కళ ఒలుకుతూ కూర్చున్న పురుష్ తన స్నేహితులు వేస్తున్న జోక్‌లను వింటూ, జవాబిస్తూ ఆనందిస్తున్నాడు. సుమతి కొడుకుని తనివి తీరాచూసి కళ్లు మూసుకుంది.

పురుష్ ఎమ్.టెక్. పూర్తి కాగానే విదేశంలో మూడేళ్ళపాటు కంప్యూటర్ కోర్సు చేసి తిరిగి భారతదేశం వచ్చి ఢిల్లీలో ప్రైవేటు కంపెనీలో చేరాడు. అంత చదువు చదివినా, పిన్న వయసులోనే పెద్ద పదవిలో ఉన్నా, అతను తల్లి మాటను జవదాటడు. ఆమెను నొప్పించి ఏ పనీ చెయ్యడు.

పెళ్ళి ప్రస్తావన వచ్చినప్పుడు మేనత్త కూతుర్ని చేసుకోమని తల్లి అడిగినప్పుడు వెంటనే ఒప్పుకున్నాడు. ఈ విధంగానయినా దూరమైన అత్తవారికి దగ్గరవ్వాలన్న తన కోరికను పురుష్ కాదననందుకు సుమతికి కొడుకు మీద అభిమానం, గౌరవం రెట్టింపయ్యాయి. ఈ సంబంధం చేసుకోవడం అన్నపూర్ణమ్మ, రాజశేఖరం గార్లకి ఏ మాత్రం ఇష్టం లేకపోయినా, తల్లి, కొడుకు పట్టిన పట్టు వదలకపోవడంతో ఏం చేయలేక అయిష్టంగానే పెళ్లి పనులు చేయించసాగారు. ఇందుకు మరో కారణం డెబ్బయ్ ఏళ్లు దాటిన ఆ

దంపతులకి చివరి ఘడియలు మనవడి దగ్గర గడపక తప్పదన్నది కూడా.

ఏ.పి. ఎక్స్‌ప్రెస్ తారాజువ్వలా దూసుకుపోతోంది. రైలు ఊపుకి తల్లీ, తండ్రీ కునికిపాట్లు పడుతున్నారు. పక్క కంపార్ట్‌మెంట్‌లలో బంధుమిత్రులు కబుర్లు, పేకాటల్లో పడ్డారు. సుమతి ఒంటరిగా మిగిలింది. బెర్త్ మీద పడుకుందే గానీ ఏదో బాధ మనసుని కృంగదీసి నిద్ర పోనివ్వటంలేదు.

పదిరోజుల క్రితం తల్లితండ్రులకి తెలియకుండా హరికి ఇలా పురుష్ వివాహమని ఉత్తరం రాస్తూ, తప్పక రావలసిందని రాసింది. అంతేకాకుండా తన మనోభావాలన్నింటినీ ఆ ఉత్తరంలో పొందుపరచి "వెయ్యి కళ్లతో మీ రాకకి ఎదురు చూస్తున్నా" నని, "మీరు వచ్చి స్వయంగా మీ కొడుకు వడుగు, స్నాతకం చేయాలని నా మనసు కోరుతోం" దని కూడా రాసింది. అ తరువాత శుభలేఖ కూడా పంపింది. అందులో ఒక్కటి కూడా అందినట్లు హరి దగ్గర నుంచి జవాబు రాకపోవడంతో నిరుత్సాహపడింది. మళ్లీ ఎందుకో జవాబు రాయకపోయినా హరి తప్పకుండా వస్తాడన్న ఆశతోనే సుమతి రైలు టైము దాకా ఎదురుచూసింది. కానీ నిరాశే ఎదురయింది. ఇంతటి ఆనంద సమయంలో కూడా ఏదో వెలితి ఆమెను బాధిస్తూనే ఉంది.

మనసు నిండా ముసురుతున్న ఆలోచనలు పాతికేళ్ల వెనక్కి రాకెట్‌లా లాక్కెళ్లాయి.

రాజశేఖరంగారు బహు శ్రీమంతుడు. ఆయనకి, అన్నపూర్ణమ్మకి కలిగిన ఏకైక పుత్రిక సుమతి. శ్రీమంతుల బిడ్డ, అందునా ఒక్కగానొక్క గారాల బిడ్డ. నేల మీద అడుగు పెడితే కందిపోతుందేమో అన్న భావంతో కిందకి దించకుండా పెంచారు ఆయాలు, బంట్రోతులు. కోరిందల్లా కాదనకుండా తెచ్చి ఇచ్చేవారు తల్లిదండ్రులు. కష్టమంటే ఏమిటో తెలియకుండా పెరిగిన సుమతికి ఆ ఇల్లు పూలపాన్పే అయింది.

కాలేజీలో చేరిన సుమతికి పి.జి. చేస్తున్న హరితో పరిచయం ఏర్పడి, అది అలా పెరిగి పెరిగి ప్రేమగా మారి, పెళ్లి చేసుకుందా మనేదాకా వచ్చింది. ఇది తెలిసిన రాజశేఖరం దంపతులు హరి వివరాలు కనుక్కోగా అతను మధ్యతరగతి కుటుంబీకుడని, ఇద్ద రన్నలు, ఇద్దరు చెల్లెళ్లు గల కుటుంబమని

తెలియగానే కూతుర్ని అత్తవారింటికి పంపడం ఇష్టం లేని వీరి మదిలోకి ఒక ఆలోచన వచ్చింది. హరిని ఇల్లరికం తెచ్చుకుని సుమతిని తన కళ్లెదురుగానే ఉంచుకోవచ్చు ననుకున్నారు. హరి తల్లిదండ్రులతో మాట్లాడి, బాగా డబ్బిచ్చి ఒప్పించి, హరితో సుమతి వివాహం ఘనంగా జరిపించి అల్లుడిని తీసుకొచ్చి, పిహెచ్.డి. చెయ్యమని తన ఇంట్లోనే ఉంచుకున్నారు.

ప్రేమ జంట - అందునా కోటీశ్వరుని అల్లుడు కావడం హరికి ఆ ఇల్లు స్వర్గంలాగా ఉండి, భార్య రతీదేవిలా కనపడేది. అకస్మాత్తుగా వచ్చి పడిన సిరి, ఆనందాలు అతడి జీవిత గమనాన్నే మార్చేశాయి.

మూడున్నర ఏళ్లలో డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. మామగారి పలుకుబడితో ఉన్న ఊళ్లోనే ఉద్యోగం సంపాదించాడు.

ఉద్యోగంలో చేరి చేతినిండా సంపాదించుకుంటున్నా తనూ, భార్యా అత్తమామల అడుగు జాడల్లోనే నడుచుకోవలసిరావడం హరికి కొంచెం ఇబ్బందిగానే ఉండేది. ఏ విషయంలోనూ హరికి స్వాతంత్ర్య ముండేది కాదు. తమ తాహతుకి తక్కువయిన స్నేహితులొస్తే చిన్న చూపూ చూసే అత్తమామలంటే హరికి చిరాకు కలగసాగింది. అలాగే తన తరపు బంధువులు వచ్చినా ఆదరణ ఉండేది కాదు. భార్యని తీసుకుని వేరే కాపురం పెట్టుకుని స్వేచ్ఛగా, స్వతంత్రంగా బ్రతకాలని నిశ్చయించుకున్నాడు. వేరే కాపురం పెట్టుకుంటామని రాజశేఖరం గారితో అన్నప్పుడు తాడిచెట్టు ఎత్తున ఎగిరిపడుతూ "ఇంత గారాబంగా పెంచుకున్న నా బిడ్డకి నీ ముష్టి జీతంరాళ్లతో ఏం పెడతావు? కావాలంటే నువ్వు వెళ్లు. నా బిడ్డ మాత్రం ఈ ఇల్లు దాటి రా" దని, "ఈ విషయాలు పెళ్లికి ముందే మీ తల్లిదండ్రులకి చెప్పి, ఆ షరతు మీదే పెళ్లి జరిపా" నని నిక్కచ్చిగా చెప్పేశాడు.

అదే విషయం సుమతికి చెప్పినప్పుడు, "మీరు లేందే క్షణం బ్రతకలేనని, అలాగే అమ్మా, నాన్నా నేను లేనిదే ఉండలేరని, నాకు దూరంగా వాళ్లు ఉండటానికి ఒప్పుకోరని, నా మీదే ప్రాణాలన్నీ పెట్టుకుని బతుకుతున్న వాళ్లనీవయసులో మనం వదిలేసి వెళ్లడం భావ్యం కా" దని బతిమాలడంతో, అమాయకంగా అర్థిస్తున్న భార్య పవిత్ర ప్రేమని దూరం చేసుకోలేక ఆ ఇల్లు

కదల్లేకపోయాడు. రాను రాను వారి ఆంక్షలు హరికి ముళ్లబాటలా అనిపించసాగాయి. స్వేచ్ఛగా ఎక్కడికన్నా ఎగిరిపోవాలని మనసు తహతహలాడింది. పెళ్లయిన కొత్తలో ఈ డబ్బూ, హోదా తననెంత మురిపించి, గర్వపడేలా చేశాయో, ఇప్పుడంత చిరాకుని కలిగిస్తున్నాయి.

సుమతి సరసన చేరి ఆమె నిర్మలమైన ప్రేమను పొందినప్పుడు మాత్రం హరిలోని విసుగు, చిరాకు మాయమయ్యేవి. ఇటు ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే సుమతిని వదల్లేక, అటు బందిఖానాలాంటి ఆ ఇంట్లో ఉండలేక గిజగిజలాడుతున్న హరి ఒక మిత్రుడిచ్చిన సలహాని పాటించాడు.

అతని ప్రయత్నం ఫలించి పోస్టు పిహెచ్.డి.కి అమెరికాలో ఫెలోషిప్ వచ్చింది. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, అమెరికా వెళ్తున్నానని చెప్పిన రోజు రాజశేఖరం, అన్నపూర్ణమ్మ తమ అనుమతి తీసుకోకుండా అంతటి నిర్ణయం తీసుకున్నందుకు విరుచుకుపడ్డారు. ఏది ఏమైన వెళ్లి తీరతానని, సుమతిని కూడా వెంట తీసుకెళ్తున్నానని చెప్పినప్పుడు ఆ దంపతుల కళ్లవెంట నిప్పుకణాలే రాల్తాయి.

"నువ్వు వెళ్తున్నదే కాక నా బిడ్డని కూడా దేశం కాని దేశం తీసుకెళ్తావా? అక్కడ పనివాళ్లన్నా దొరకరు. కింద కాలుపెట్టి ఎరగని నా బిడ్డచేత అక్కడ అంట్లు తోమిస్తావా? కావాలంటే నువ్వు వెళ్లి నీ ఖర్మానికి అక్కడ ఏడు, నా బిడ్డ నా గుమ్మం కదిలి రాదని మరోసారి చెప్తున్నా" అంటూ చెప్పేసి వెళ్లిపోయారు. తరువాత సుమతి కూడా తల్లిదండ్రులతో ఎంతో చెప్పి బతిమాలింది. ఎన్ని విధాల చెప్పినా, "నిన్ను వదిలి ఉండలే" మని వాళ్లు సుమతి దగ్గర కళ్ల నీళ్లు పెట్టుకోగానే ఆమె వారి ప్రేమకి కరిగి మళ్లీ పెదవి విప్పలేకపోయింది. ఇలా భర్త తల్లిదండ్రుల మధ్య నలిగిపోయిన సుమతి చివరికి భర్తకి పోస్టు పిహెచ్.డి. కాగానే వచ్చేయమని, అంతదాకా ముసలి తల్లిదండ్రుల వద్ద ఉంటానని నచ్చచెప్పబోయిన సుమతి మీద కోపం వచ్చి, ఒక్కడూ ప్రయాణమై వెళ్లిపోయాడు.

వెళ్లిన కొత్తలో రాసే ప్రతి ఉత్తరంలోనూ ఆమెను తన వద్దకి వచ్చేయమని, నిన్ను వదిలి ఒంటరిగా ఉండలేకుండా ఉన్నానని రాసేవాడు.

దానికి సుమతి తను తల్లిని కాబోతున్నానని, ఈ పరిస్థితిలో అమ్మా, నాన్నా అసలే పంపరని, త్వరగా చదువు పూర్తి చేసుకుని వచ్చేయమని రాసేది.

నిజానికి హరికి దూరంగా ఉండటం సుమతికి ఎంతో కష్టంగా ఉన్నప్పటికీ, మూడేళ్లలో వచ్చేస్తాడు కదా అని రోజులు లెక్కపెట్టుకుంటూ కాలం గడపేది. అతని ఉత్తరాలే ఆమెకు అతని ఎడబాటుని మరిపించేవిగా ఉండేవి. తరువాత్తరువాత అతని వద్ద నుంచి ఉత్తరాల రాక తగ్గడంతో చదువుతో తీరిక లేక రాయలేకపోతున్నాడని సరిపెట్టుకో జూసేది. రానురాను పూర్తిగా ఉత్తరాలు రాకపోవడంతో సుమతి తను వెళ్లలేదన్న కోపంతో రాయడం మానేసి ఉంటాడని బాధపడేది. రోజూ పోస్టుమాన్ రాకకోసం వెయ్యి కళ్లతో ఎదురు చూసేది. వచ్చే ఉత్తరాల్లో హరిది లేకపోవడంతో ఒంటరిగా కూర్చుని గుండె చెరువయ్యేలా ఏడ్చేది. ఏదో పోగొట్టుకున్నట్లు బాధపడేది. తల్లిదండ్రులు ఈ విషయమై తమకి ఏమి పట్టనట్లుండటం సుమతికి మరీ బాధగా ఉండేది. ఇప్పుడు ఈ తల్లిదండ్రుల ప్రేమ, సౌఖ్యం, ఈ హోదా చిరాకు కలిగించసాగాయి. గర్భిణీలుగా ఉన్నవాళ్లు ఎంత ఆనందంగా ఉంటే అంత ఆరోగ్యమైన బిడ్డ పుడతాడని డాక్టర్లు చెప్పే మాటలకు నిర్లిప్తంగా నవ్వుకునేది.

నెలలు నిండాక కొడుకు పుట్టగానే ఆ శుభవార్తని హరికి తెలియజేసింది. దానికి 'కంగ్రాట్యులేషన్స్' కార్డు మాత్రం రావడంతో సుమతి తనేదో తప్పు చేసినట్లు బాధపడసాగింది. హరి వెళ్లి రెండేళ్లు దాటిపోయాయి. సుమతి రాసిన ఉత్తరాలు అందుతున్నాయో లేదో కూడా తెలిసేదికాదు. ఎవరికీ చెప్పుకోలేని మనోవేదనకి గురై, దేని మీదా ఆసక్తి లేకుండా పోయి, నిర్లిప్తంగా ఒంటరిగా గదిలో కూర్చుని కాలం గడిపేది.

సుమతిలో కలిగిన మార్పుని చూసి రాజశేఖరంగారు ఆమెను ఉద్యోగంలో చేర్పించారు. పగలంతా ఉద్యోగం సాయంకాలాలు పిల్లాడితో కాలక్షేపానికి నెమ్మదిగా అలవాటుపడినా, రాత్రి వేళల్లో హరి జ్ఞాపకాలు ఆమెను బాధించేవి. అతనితో అనాడు వెళ్లిపోయి వుండవలసిందనిపించేది. కానీ ఆ తప్పునిప్పుడు ఎలా దిద్దుకోవాలో అర్థం కాక బంగారు పంజరంలో బంధింపబడిన రామచిలకలాగా గిలగిల్లాడేది.

అమెరికా నుంచి వచ్చిన తార సుమతిని తనింటికి రమ్మని ఫోన్ చేయగానే ఆఫీసు నుంచి తార ఇంటికి వెళ్లిన సుమతి - హరి అమెరికాలో ఏదో అమెరికన్‌తో ఉంటున్నాడన్న పిడుగులాంటి వార్త చెప్పినప్పుడు సుమతి కళ్లు తిరిగి పడిపోయింది. తార ఆమెను ఊరడించి ఆమె చేసిన తప్పుని పదేపదే గుర్తుచేసింది. ఎంత తల్లిదండ్రులైనా ఎంత గారాబంగా పెంచినా, ఎంత నిన్నొదిలి ఉండలేకపోయినా భర్త వెంట వెళ్లకుండా ఉండటం నీదే తప్పని, ప్రపంచ విరుద్ధమని దేనికన్నా హద్దు లుంటాయని. అది తెలుసుకోకుండా తప్పటడుగు వేశావరని తార చీవాట్లేసినప్పుడు తన తప్పు తెలుసుకుని, ఆనాడు తల్లిదండ్రుల్ని ఎదిరించి భర్తతో వెళ్లిపోయిఉండవసిందని పించింది. చెయ్యి దాటిపోయాక బాధపడుతున్నానని తెలుసుకుంది.

ఇంటికొచ్చిన సుమతి తొలిసారి తల్లిదండ్రులతో గట్టిగా పోట్లాడి "నాజీవితం సర్వనాశనం కావడానికి మీరే కారకు" లని నిందించింది. ఆ రోజు నుంచి ఆ ఇల్లు నరకంలా అనిపించేది. తల్లిదండ్రుల్ని చూస్తే విసుగు, చిరాకు కలిగేవి. ఆ ఇంట్లో తనకి 'నా' అనే వ్యక్తి పురుష్ ఒక్కడే అనిపించేది. ఆనాటి లగాయితు ఆమె బిడ్డే తన ప్రాణం, లోకం, సర్వస్వం అనుకుని అతనితోనే ఎక్కువ కాలాన్ని గడిపేది. అతని తిండి, చదువు, ఆరోగ్యం గురించి స్వయంగా చూసుకునునేది.

తాను కోరుకున్నట్లే ఆమె కొడుకుని ఇంజనీర్‌ని చేసింది. విదేశాలకు పంపి కంప్యూటర్ కోర్సు చెప్పించింది. పురుష్‌కి కూడా తల్లే సర్వస్వం కావడంతో ఆమె మాటకి ఎంతో గౌరవం ఇచ్చేవాడు. అందుకే ఈనాడు తల్లి కోరికను కాదనకుండా అత్త కూతుర్ని వివాహం చేసుకుంటున్నాడు.

హరి ఇటీవలే అమెరికా నుంచి తిరిగొచ్చి బెంగుళూరులో ఉంటున్నాడని రాస్తూ అతను తన భర్తకి ఇచ్చిన అడ్రస్‌ని కూడా పంపించింది తార.

ఆ అడ్రస్‌కే ఉత్తరం రాసింది సుమతి. హరి పురుష్ పెళ్లికి తప్పక వస్తాడని మన సెందుకో నొక్కి నొక్కి చెప్తోంది. అందునా హరి చెల్లెలి కూతుర్నే చేసుకోవడం వల్ల ఇటు నుంచి కాకపోయినా, చెల్లెలి తరపునుంచైనా వస్తాడని ఆశ పడుతోంది. పాతికేళ్ల క్రితం విడిపోయిన తామిక కలవడం అసంభవమని

తెలిసినా, అతన్ని ఒక్కసారి చూడాలన్న కోరికే ఆమె చేత ఆ ఉత్తరం రాయించింది.

ముహూర్తం టైముకైనా వస్తే బాగుండు నని అనుకుంటూ, క్షణ క్షణం ఆశని పెంచుకుంటూ అదే ఆశతో రైలెక్కింది. ఏదో స్టేషన్‌లో రైలు ఆగడంతో జ్ఞాపకాల పొరల్లోంచి బయట కొచ్చింది సుమతి.

దిగిన దగ్గర నుంచి ఆడపెళ్ళివారు మగపెళ్ళివారికి సకల మర్యాదలు చేస్తున్నారు. మర్నాడు ఉదయం తొమ్మిది గంటలకు వడుగు, తరువాత స్నాతకం. టైము గడిచిపోతోంది. సుమతి మనసు, కళ్ళు వీధి గుమ్మానికే అతుక్కుపోతున్నాయి. తల్లిదండ్రులు దేనినీ పట్టించుకోకుండా వచ్చిన బంధుమిత్రులతో కబుర్లు చెప్తూ, విందులు ఆరగిస్తూ మర్యాదలు పొందుతూ కూడా తమకింకా ఏదో లోటు జరుగుతోందంటూ వంక పెడుతున్నారు.

మర్నాడుదయం మనవడి వడుగు, స్నాతకం చేయడానికి పీటల మీద కూర్చోడానికి తయారవుతున్న తరుణంలో చిన్న పెట్టెతో ప్రవేశించాడు జుట్టు నెరిసి, వయసు మళ్ళిన వ్యక్తి. చూడగానే అతనిలో హరి పోలికల్ని గుర్తుపట్టిన సుమతి ఎదురెళ్ళి అతని చేతిలో పెట్టెను అందుకుంది. ఆప్యాయంగా సుమతి భుజం చుట్టూ చెయ్యి వేశాడు హరి. ఆ స్పర్శకి ఆమె పెళ్ళి కూతురిలా ముడుచుకుపోయింది.

"వీడెందు కొచ్చాడిప్పుడు?" అన్న తండ్రి మాటలకి - "నేనే రమ్మని రాశాను. మా అబ్బాయి పెళ్ళి మా చేతుల మీదే జరగాలి. ఆయన తండ్రిగా వడుగు, స్నాతకం చేస్తారు. మీరు మీ హద్దుల్లో ఉండి మీ పెద్దరికాన్ని, గౌరవాన్ని నిలుపుకోవడం మంచి" దంటూ అందర్లో కూతురు ఎదురు తిరగడం చూసి నోళ్ళు పడిపోయిన వాళ్ళలా అక్కడి నుంచి తప్పుకున్నారిద్దరూ.

పెళ్ళిలో పురుష్, సుకన్య ఒకరినొకరు చూసుకుని సిగ్గుతో మురిసిపోతున్నట్లే, హరి, సుమతులు కూడా ఒకరినొకరు సూటిగా చూసుకున్నప్పుడు పాత జ్ఞాపకాలతో, సిగ్గుతో బరువెక్కిన రెప్పలు వాల్చుకోసాగారు.

పెళ్ళితంతులన్నీ ఇరుపక్కలా ఎంతో ఘనంగా, ముద్దు ముచ్చట్లతో

జరుపుకున్నారు. ఒక్క రాజశేఖరం దంపతులు తప్ప మిగతా అంతా ఒకటై వేడుకలు జరుపుకోగా, వారు మాత్రం శ్రోతల్లా చూస్తూ ఉండిపోయారు. నలుగురిలో జరిగిన అవమానానికి కోపం వచ్చి అన్నింటికీ దూరంగానే ఉంటున్నారు. వాళ్లను పట్టించుకోకుండా స్వయంగా అన్ని నిర్ణయాలూ తీసుకుంటున్న కూతుర్ని చూసి 'ఎంతో ప్రాణంగా పెంచిన కూతురే మనని నిర్లక్ష్యం చేస్తూంటే ఇంకెవరి నడుగుతాం?' అనుకున్నారు.

తంతులన్నీ ముగిసి ఎవరిళ్లకు వాళ్లు బయలుదేరి వెళ్లిపోయారు. సాయంత్రం బండికి సుమతి కొడుకు-కోడల్ని తీసుకుని బయలుదేరుతోంది.

విడిదిలో సామాను సర్దుతున్న సుమతి దగ్గరికొచ్చాడు వెళ్తున్నానని చెప్పడానికి హరి. ఎక్కడి సామానక్కడే వదిలి హరి వెంట స్టేషన్‌కు బయలుదేరింది సుమతి.

స్టేషన్‌లో కూర్చున్న ఇద్దరి హృదయాలు ఇక దూరమవుతామన్న బాధని తట్టుకోలేకుండా ఉన్నాయి. ఆ బాధ మౌనంగా మారి మాటల్ని పెగిలి రానివ్వటం లేదు. ఇంతవరకు పెళ్లి గురించిన విషయాలు తప్ప స్వ విషయాలేవీ మాట్లాడుకోలేదిద్దరూ. ఇప్పుడే ఆ ఏకాంతం కూడా లభించింది. ఇద్దరూ కాసేపటికి సాహసించి మాట్లాడబోయేసరికి రైలు కూత కూస్తూ స్టేషన్‌లోకొచ్చి ఆగింది.

"సుమా!" అన్నాడు ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ, "హరీ!" అంది కళ్లలో సముద్రపు కెరటాలని ఆపలేక.

"నా దగ్గరికి వచ్చేస్తావా, సుమా!" ఆమె కళ్లల్లోకి చూస్తూ అడిగాడు హరి.

"మరి మీ అమెరికన్ భా... ర్య?" అంది తలొంచుకుని.

"నేను అక్కడ ఆమె పేయింగ్ గెస్ట్‌ని మాత్రమే! ఎలా వెళ్లానో అలాగే ఒంటరిగా తిరిగి భారత దేశానికి వచ్చాను. నీకు అభ్యంతరం లేకపోతే నా దగ్గరికి వచ్చేయ్, సుమా!" అన్నాడు ఆమె జవాబుకి ఎదురు చూస్తూ.

"మన అబ్బాయి, కోడలి చేత కాపురం పెట్టించి త్వరలోనే వచ్చేస్తా, హరీ!" అన్న జవాబుకి తృప్తిగా ఊపిరి పీల్చి, ఆమె చేతిని అప్యాయంగా నిమిరి

రైలెక్కాడు హరి.

రైలు సుమతి నుంచి హరిని దూరం చేస్తున్నప్పటికీ ఆ క్షణం వారిద్దరి హృదయాలు దగ్గరైపోయినంత ఆనందంతో పులకించిపోయాయి.

ఢిల్లీలో కొడుకు - కోడలి చేత కాపురం పెట్టించి పెట్టెలో బట్టలు సర్దుకుంటున్న సుమతిని చూసి, రాజశేఖరం దంపతులు "ఎక్కడి" కని అడిగినప్పుడు "నా భర్త దగ్గరికి" అని కటువుగా చెప్పిన కూతుర్ని చూసి, "యాభై ఏళ్లు వస్తున్న నీకు ఈ వయసులో భర్త కావాలా?" అని వెటకారంగా అడుగుతున్న మాటలకి -

"ఇప్పుడు నాకు భర్త కాదు కావలసింది - తోడు, నీడ. అంతే గానీ డబ్బూ, ధనంతో ఉన్న బంగారప్పంజరం కాదు. ఈ తెలివి, ధైర్యం ఆనాడే నా కుండి ఉంటే జీవితంలోని మధురిమని పోగొట్టుకుని, ఇన్నేళ్లపాటు నా జీవితాన్ని మోడు చేసుకుని, ఇంత వేదనకు గురై ఉండేదాన్ని కాదు. ఇప్పటికైనా కళ్లు తెరుచుకుని, నా తప్పుని దిద్దుకుంటున్నాను. ఎవరికి ఎందరున్నా, చివరికి ఆదుకునేది భార్యకి భర్త, భర్తకి భార్యే! తల్లిదండ్రులు బిడ్డలకి ఒక త్రోవ చూపేవరకే పెద్దలు బాధ్యులు. ఆపైన పిల్లలు వారి వారి ఇళ్లని వారు ఏర్పరచుకుని వారి నిర్ణయాలు వారే తీసుకోవాలి. తల్లిదండ్రులకి పిల్లల మీద ప్రేమాభిమానాలుండటం, పిల్లలు తమ కళ్లెదురుగా ఉండాలనుకోవడం సహజమే కానీ, దేనికన్నా హద్దులుంటాయి. అవి మితిమీరితే ఉండే ప్రమాదానికి ఉదాహరణ నా జీవితమే!

"అలాంటి బిడ్డల బ్రతుకులు నాలాగే ఉంటాయి. మీకు పిల్ల మీదగ్గరుండాలన్న కోరిక తప్ప మీ పిల్ల పడిన మనో వేదనని అర్థం చేసుకోలేదు. ఈ వయసులో నేను భర్త కావలసి వెళ్లటంలేదు. నా ఇంటికి నేను వెళ్తున్నాను. ఇన్నాళ్లూ దూరంచేసుకున్న నా భర్త అప్యాయతను, ప్రేమను పొందడానికి వెళ్తున్నాను. స్వతంత్రమైన జీవితాన్ని నా భర్త దగ్గర చివరి దశలోనైనా నిశ్చింతగా గడపాలన్నదే నా కోరిక. ఉంటా!" అని కారెక్కుతున్న కూతుర్ని అచేతనులై చూడసాగారు రాజశేఖరం, అన్నపూర్ణమ్మా. ✳

**(6-4-1994 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)**